# సమన్వయంతో పని చేయాలి

- ప్రతి గడపకూ వెళ్లి అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి
- గ్యారెంటీ, వారంటీ పథకాలను విపక్షాల పాలిత రాష్ట్రాల్లో అమలు తీరును ఎండగట్టండి
- బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

చొప్పదండి, అక్టోబర్14: ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేసి, తన గెలుపునకు కృషి చేయాలని పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సుంకె రవిశంకర్ పిలుపునిచ్చారు. గంగాధర మండలం బూరుగుపల్లిలోని నివాసంలో శనివారం ఆయన చొప్పదండి మండలానికి చెందిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, కార్యకర్తలను ఆయా గ్రామాల్లో పార్టీ పరిస్థితులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు ఏదో ఒక రకంగా ప్రతి గడపకూ చేరాయని, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని కోరారు. వచ్చేది మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమేనని వివరించాలన్నారు. ఈనెల 15న ప్రజలు మెచ్చేలా కేసీఆర్ మేనిఫెస్టోను విడుదల చేస్తున్నారని, ప్రజలందరూ గమనించాలని కోరారు. కేసీఆర్ విడుదల చేసే మేనిఫెస్టోను నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించాలని సూచించారు. గత రెండుసార్లు జరిగిన ఎన్నికల్లో ప్రభుత్వం విడుదల చేసిన మేనిఫెస్టోలోని హామీలను పూర్తి స్థాయిలో నెరవేర్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ వారి పాలిత రాష్ట్రాల్లో ఎక్కడా అమలు చేయని గ్యారెంటీ, వారెంటీలతో ప్రజల ముందుకు వస్తున్నారని, వారి కుట్రలను ప్రజలకు వివరించాలని నాయకులను, కార్యకర్తలను కోరారు. ఓటు అడుగడానికి వచ్చే కాంగ్రెస్ నాయకులను ఈ గ్యారెంటీలు మీరు పాలించే రాష్ట్రాల్లో ఎక్కడ అమలు చేస్తున్నారో తెలుపాలని నిలదీయాలని పిలుపునిచ్చారు. ప్రజలు బీఆర్ఎస్‌ను మరోసారి ఆదరిస్తే రాష్ట్రంలో, నియోజకవర్గాల్లో ఊహించని అభివృద్ధి జరుగుతుందని, దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి, జడ్పీటీసీ మాచర్ల సౌజన్య–వినయ్, సింగిల్ విండో చైర్మన్లు వెల్మ మల్లారెడ్డి, మినుపాల తిరుపతి రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం చుక్కారెడ్డి, వైస్ చైర్మన్ రాజశేఖర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆరెల్లి చంద్రశేఖర్ గౌడ్ , మాజీ వైస్ చైర్మన్ కొత్త గంగారెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ యువజన విభాగం ఇన్‌చార్జి బందారపు అజయ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్ రెడ్డి, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు గుంట రవి తదితరులు పాల్గొన్నారు.

# ఒక్కసారి అవకాశం ఇవ్వండి

- ఐదేళ్లు సేవకుడిలా పని చేస్తా • మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి
- పలు గ్రామాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలతో సమావేశం



జూపాకలో గ్రామస్తులతో మాట్లాడుతున్న మండలి విప్ కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్ రూరల్, అక్టోబర్ 14: వచ్చే ఎన్నికల్లో తనకు ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే ఐదేళ్లు సేవకుడిలా పని చేస్తానని మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి హామీ ఇచ్చారు. మండలంలోని జూపాక, కనుకులగిద్ద, దర్మరాజుపల్లి గ్రామాల్లో శనివారం ఆయన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ, ఈటల రాజేందర్ ఎనిమిదేళ్లు మంత్రిగా పని చేసి ఎలాంటి అభివృద్ధి చేయలేదని, ఒక్కసారి నన్ను ఆశీర్వదిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకం అందిందని గుర్తు చేశారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో ఖచ్చితంగా మరోసారి కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని జోష్యం చెప్పారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని, నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించుకుంటేనే అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సంగెం ఐలన్న, సర్పంచులు అంకూస్, లక్ష్మారెడ్డి, ఎంపీటీసీ వేణుగోపాల్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఎడవెల్లి కొండాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కేతిరి రాజిరెడ్డి, సురేందర్‌రెడ్డి, వెంకటరమణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# మున్నూరు కాపులకు రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

- ఆయనపై చర్యలు తీసుకోకుంటే కాంగ్రెస్‌కు బుద్ధి చెప్తాం
- కరీంనగర్‌లో టీపీసీసీ అధ్యక్షుడి దిష్టిబొమ్మ దహనం



తెలంగాణ చౌక్‌లో నిరసన తెలుపుతున్న జిల్లా మున్నూరు కాపు సంఘం నాయకులు

తెలంగాణచౌక్, అక్టోబర్14 : పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్యను ఉద్దేశించి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై కరీంనగర్ జిల్లా మున్నూరుకాపు సంఘం భగ్గుమంది. ఆయనపై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకొని భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ సంఘం నాయకులు కరీంనగర్‌లోని తెలంగాణచౌక్‌లో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఓటుకు నోటు కేసులో డబ్బులు పంచుతూ దొరికిన దొంగ రేవంత్‌రెడ్డి అని మండిపడ్డారు. సీనియర్ నాయకుడు పొన్నాల లక్ష్మయ్య కాంగ్రెస్‌పై విమర్శలు చేయలేదని, కేవలం బీసీలకు అన్యాయం జరుగుతున్నదని, పార్టీలో గౌరవం దక్కడం లేదనే ఆవేదనతో రాజీనామా చేస్తే వారించాల్సింది పోయి రేవంత్ రెడ్డి అహకారంతో మాట్లాడారని మండిపడ్డారు. పదవుల కోసం రేవంత్ దేనికైనా ఒడిగడుతాడని ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాబోయే ఎన్నికల్లో మున్నూరు కాపుల సత్తా చూపిస్తామని హెచ్చరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బొమ్మ రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి నలువాల రవీందర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా నాయకులు కర్ర శేఖర్, సంతోష్ పటేల్, రవి, మల్లేశం, సునీల్, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

# గంగుల ఆర్మీ ఆవిర్భావం

- పాటల సీడీ ఆవిష్కరించిన మంత్రి గంగుల కమలాకర్



పాటల సీడీ ఆవిష్కరిస్తున్న మంత్రి గంగుల కమలాకర్, పక్కన మేయర్ సునీల్‌రావు

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 14: జిల్లా కేంద్రానికి చెందిన డీఎస్పీ సంతోష్ పటేల్, అంజి యాదవ్, కందుకూరి సాయికృష్ణ, రవినాయక్ ఆధ్వర్యంలో గంగుల ఆర్మీని ఏర్పాటు చేశారు. కాగా, మంత్రి గంగుల కమలాకర్ చేపట్టిన అభివృద్ధి, సేవా కార్యక్రమాలపై పాటల సీడీని రూపొందించగా, శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల మాట్లాడుతూ, ప్రజల సేవ చేసేందుకు తాను ఎప్పుడూ ముందు వరుసలో ఉంటానని, యువత తన మార్గంలోకి రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా గంగుల ఆర్మీ నిర్వాహకులు మాట్లాడుతూ, ప్రజల మన్ననలు పొందిన గంగులకు యువత అండగా ఉంటుందన్నారు. ఈ ఆర్మీకి గంగుల హరిహరన్ గౌరవాధ్యక్షుడిగా ఉంటారని, ఇందులో సభ్యులుగా ఆకుల కిరణ్ పటేల్, ఫహద్, వాసాల హరీశ్, కిరణ్‌సింగ్, రాజేశ్, వంశీకృష్ణ, కార్తీక్, అశోక్ రాజా, సదానందం, నవీన్‌కుమార్, సతీశ్‌కుమార్, సంజయ్ సింగ్, సంతోష్ నాయక్, రాజు నాయక్ ఉంటారన్నారు. త్వరలోనే డివిజన్ కమిటీలు, పూర్తి స్థాయి కార్యవర్గాన్ని ప్రకటిస్తామని చెప్పారు.

## నేటి నుంచి దేవీ శరన్నవరాత్రోత్సవాలు

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 14: జిల్లా వ్యాప్తంగా శనివారం నుంచి ఎంగిలిపూల బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభం కాగా, ఆదివారం నుంచి దేవీ నవరాత్రులు ప్రారంభం కానున్నాయి. దసరాకు ముందు తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని పూజించడం ఆనవాయితీగా వస్తున్నది. ఇందుకు ఆలయాలు, మండపాలు ముస్తాబయ్యాయి. రోజుకో రూపంలో అమ్మవారు దర్శనమివ్వనుండగా ప్రత్యేక అభిషేక, అర్చనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. మండపాల వద్ద పూజలు, భజనలు, అన్నదానాలు, ప్రసాద వితరణ చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఉదయం కొన్ని చోట్ల, సాయంత్రం కొన్ని చోట్ల అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన జరుగనున్నాయి. ఈ క్రమంలో తొమ్మిది రోజుల పాటు నగరంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొననుంది. అయితే, ఇప్పటికే కొందరు భవానీ దీక్షను స్వీకరించగా, ఆదివారం పెద్ద ఎత్తున దీక్షను స్వీకరించనున్నారు. ఈ క్రమంలో నగరంలోని చైతన్యపురి మహాశక్తి ఆలయంలో, జ్యోతినగర్‌లోని హనుమాన్ సంతోషిమాత ఆలయంతో పాటు పలు కూడళ్లు, కాలనీల్లో మండపాలు ఏర్పాటు చేసి వేడుకలు నిర్వహించనున్నారు. నగరంలోని మహాశక్తి ఆలయంలో తొమ్మిది రోజులు ఒక్కో అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇస్తారు. తొలి రోజు ఆదివారం శైలపుత్ర బాలా త్రిపుర సుందరీ దేవీ అలంకరణ, 16న గాయత్రీ దేవీ బహ్మచారిణిగా, 17న చంద్రఘంట దేవీ అలంకరణ, అన్నపూర్ణ దేవీగా, 18న కుష్మాండ దేవీగా, మహాలక్ష్మిగా, 19న స్కందమాతగా, మహాచండీ దేవీగా, 20న మూలా నక్షత్రం సందర్భంగా సర్వస్వతీ దేవీగా కాత్యాయణిదేవి అలంకరణ, 21న శ్రీలలితాదేవి కళారాత్రి అవతారం, 22న దుర్గాష్టమి రోజున శ్రీదుర్గాదేవీగా, 23న విజయదశమి సందర్భంగా శ్రీరాజరాజేశ్వరి దేవీగా అమ్మవారు భక్తులకు దర్శనం ఇస్తారు.

## యశోద దవాఖానలో అరుదైన శస్త్ర చికిత్స




మాట్లాడుతున్న డాక్టర్ శ్రీకాంత్‌రాజు

విద్యానగర్, అక్టోబర్ 14: వేములవాడకు చెందిన విద్యుల్లత అనారోగ్యానికి గురి కాగా హైదరాబాద్‌లోని యశోద దవాఖాన (హైటెక్ సిటీ) సీనియర్ కన్సల్టెంట్ వాస్కులర్, ఎండో వాస్కులర్ సర్జన్, ఫుట్‌కేర్ స్పెషలిస్టు డాక్టర్ శ్రీకాంతరాజు శస్త్ర చికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. విద్యుల్లతకు రక్త ప్రసరణ (ఇస్కీమియా) తగ్గి ప్రాణాపాయ స్థితికి వెళ్లింది. ఆక్యుట్‌లింబ్ ఇస్కిమియా వాస్కులర్ ఎమర్జెన్సీ అవయవ నష్టం ఎక్కువగా కలిగింది. దీంతో ప్రాణాపాయం ఉందని వైద్యులు గ్రహించారు. ఎడమచేతి కదలికలు తగ్గడంతో వెంటనే పరీక్షలు చేసి లెఫ్ట్ ట్రాన్స్‌బ్రాచియల్ ఎంబోలెక్టమిని విజయవంతంగా పూర్తి చేశారు. వెంటనే ఎడమ చేతిపై భాగంలో పల్స్ కూడా మెరుగయ్యాయి. ఈ క్రమంలో కరీంనగర్‌లోని యశోద దవాఖానలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ శ్రీకాంతరాజు మాట్లాడారు. విద్యుల్లత వెంటనే దవాఖానకు రావడంతో ప్రాణాపాయం తప్పిందని, దవాఖానలో అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో ఉండడంతో శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేశామన్నారు. ఎవరైనా అనారోగ్య సమస్యలతో బాధపడితే ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చన్నారు.

# క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలి



క్రీడాకారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్

మానకొండూర్ రూరల్, అక్టోబర్ 14: మండలంలోని అన్నారం గ్రామంలో శనివారం అంబేద్కర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, క్రీడాకారులు పోటీల్లో క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని, క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొట్ల కిషన్, ఉప సర్పంచ్ ముగాల మహేందర్ రెడ్డి, ఎంపీటీసీ గొల్లపల్లి రాజనర్సు, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు పడకంటి వీరేశం, ఎస్ఎంసీ చైర్మన్ పురం అనిల్ కుమార్, నాయకులు రాయికంటి కిరణ్, అట్ల గట్టయ్య, పోతర్ల అంజన్న, రామస్వామి, రాజు, తిరుపతి, శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.